# వీకెండ్

సరోజకి తన పక్కింటి వాళ్లను చూస్తే ఆశ్చర్యంగా వుంటుంది. శుక్రవారం వచ్చింది మొదలు వాళ్లెప్పుడొస్తారా అని ఆసక్తిగా ఎదిరిచూస్తుంది. శని ఆదివారాలు వాళ్లని గమనిస్తూనే వుంటుంది. వాళ్లిద్దరు వేర్వేరు సిటీల్లో ఉద్యోగాలు చేస్తారు. ఒకరు తూర్పునించి, ఒకరు పడమర నించి ఇక్కడి సొంతగూటికి వారాంతంలో చేరుకుంటారు. రాగానే ఆమె ఇల్లంతా గంటలో సర్దేస్తుంది. అతడు స్వీట్లు, బిర్యానీలు పట్టుకొని వస్తాడు. నవ్వులు, సరసాలు,

కబుర్లు... పెళ్లయి అయిదేళ్లయినా ఇంకా కొత్త దంపతుల్లానే కన్పిస్తారు. తమ పెళ్లయి నాలుగేళ్లే అయినా ఏదో గొడవల్తో దూరం పెరుగుతోంది.

'సరోజా... టవల్ ఎక్కడ పడేసారే? దువ్వెనకి వెంట్రుకలు తీయాలన్న తెలివి కూడా లేదు" మదన్ అరుపులకి ఈ లోకంలోకొచ్చింది సరోజ.

"వస్తున్నానండీ..." అంటూ లోపలికి పరిగెత్తింది.

"బయటేం చేస్తున్నావ్... టిఫిన్ బాక్స్‌లో ఇంత పడేయ్. ఆఫీస్‌కి టైమైంది... ఇదిగో ఈ దువ్వెన్ని తీసికెళ్లి పెంటలో పడెయ్యి" అన్నాడు సీరియస్‌గా.

"పక్కింటి వాళ్లు ఈ వారం ఇంకా రాలేదేంటా అని చూస్తున్నాను". దువ్వెనకున్న వెంట్రుకల్ని తీసేస్తూ చెప్పింది.

"వాళ్లదో బతుకు... భార్యాభర్తలంటే కల్సుండాలి కాని... డబ్బు పిచ్చిలో పడి చెరో చోట జాబ్ చేయటం, వారానికి రెండ్రోజులు కల్సుకోవటం... అవేం జీవితాలు?" కసురుకున్నాడు మదన్ తడి టవల్‌ని ఓచోట పడేస్తూ...

ఈలోగా సరోజ అన్నంకూర టిఫిన్ బాక్స్‌లో సర్ది బ్యాగ్‌లో పెట్టింది.

"వాడో విచిత్రమైన మనిషి... వచ్చేటపుడు పెళ్లానికి ఫ్లవర్‌బొకే తీసుకొస్తాడు. ఏ మగాడైనా మల్లెపూలు తెస్తాడు గాని..." చిరాగ్గా చెప్పాడు మదన్.

"మీరెప్పుడో మల్లెపూలు తెచ్చినట్టు..." మూతివిరుపుతో అంది సరోజ.

"అయిదు రూపాయలకు మూరెడు కూడా ఇవ్వట్లేదు. వాటితో ఏమొస్తుంది? అయిదు రూపాయల్తో కిలో టమాటలొచ్చినా ఒకరోజు గడుస్తుంది" మరింత చిరాగ్గా అన్నాడు సాక్స్‌లేసుకుంటూ...

సరోజకి రాత్రి అనుభవం గుర్తొచ్చింది.

ఆయన దగ్గరికి తీసుకుంటున్నప్పుడు స్విచ్చాఫ్ చేస్తూ... గుర్తొచ్చి చెప్పింది 'కరెంట్ బిల్లొచ్చిందండీ' అని.

"ఎంత" అనడిగాడు.

"నాలుగువందల అరవైరెండు రూపాయలు"

చివాలున లేచి కూచున్నాడు మదన్.

"నీకు నెలనించీ మొత్తుకుంటున్నాను. గిర్నీ పట్టియ్యాల్సినవి కూడా ఇంట్లో గ్రైండర్ పడతావ్. హీటర్ పెట్టి సలసల నీళ్లుకాగేంతవరకూ మర్చిపోతావ్. మనకి రెండొందలకి మించి బిల్లు రాదు. నీవల్ల ఛస్తున్నాను" అన్నాడు కోపంగా.

"నేనేం చేసాను. మసాల పొడులు గిర్నీలో పట్టరు. ఇంట్లో గ్రైండరున్నదెందుకు? నీల్లు వేడిగా లేకపోతే మీరే తిడతారు" చిన్న బుచ్చుకొని అటు తిరిగి పడుకుంది సరోజ.

"నాలుగువందలరవై... అంటే మాటలా? ఎక్కన్నించి తేవాలి?" మదన్ కూడా కాసేపు నిశ్శబ్దమైపోయాడు. తర్వాత తిరిగి సరోజపై చెయ్యివేసాడు.

మనసు తాకని శృంగారం...

మదిదోచని శృంగారం... అదీ ఒక నైట్‌డ్యూటీలా... ఆ రాత్రి గడిచింది.

పొద్దున్నే పక్కింట్లో నందిత కన్పించింది. వాళ్లాయనది ప్యాంటు షర్టు వేసుకుంది. కళ్లల్లో వెలుగూ, బుగ్గలపై గాట్లు... ఎర్రబడ్డ కళ్లల్లో అదోఆకర్షణ...

"ఎప్పుడొచ్చారు" ఆసక్తిగా అడిగింది సరోజ.

"రాత్రి పది దాటింది. దిలీప్ నాకంటే అరగంట ముందే వచ్చాడు. ఇల్లు పక్క హోటల్నించి బిర్యానీ తెచ్చిపెట్టాడు. ఇంకా రాత్రంతా కబుర్లు... క్యాండిల్

లైట్‌లో ఆ ఎంజాయ్... నిద్ర సరిగ్గా లేదు" అంది కొంచెం సిగ్గుపడుతూ...

వారంలో రెండురోజులు కల్సి... మిగతా అయిదురోజుల అనుభూతుల్ని, శృంగారాల్ని అంతకు రెట్టింపు అనుభవంతో గడుపుతున్న వాళ్ల జీవితాల్లోని ఆనందం తమకంటే గొప్పదనిపించింది సరోజకు.

దూరమే ఒక ఉత్ప్రేరకంగా పని చేస్తోందా అన్పించింది. సుదీర్ఘమైన ఆట విడుపుతో జరిగే పునస్సమాగమం... ఆనందమయ జీవితానికి కొత్త పరిమళమవుతుంది.

ఇంటికి చక్కగా చేరుకున్నావా?... అంటూ నిత్యం అందుకునే సందేశాలు... ఫోన్‌లు, ఇ-మెయిల్‌లు నిజ జీవితంలో వారి మధ్య దూరాన్ని హరించే వంతెనలు.

వివాహ వ్యవస్థను కొత్త మలుపు తిప్పుతున్న ప్రపంచీకరణం.

"పోయిన వారం రాలేదేంటీ?" అనడిగింది సరోజ.

"పోయిన శనివారం దిలీప్ బర్త్‌డే ప్లస్ మా మ్యారేజ్ డే కల్సి వచ్చింది. ఇద్దరం కల్సి అరకు వెళ్లాం" అని చెప్పింది నందిత.

"వాళ్ల జీవితం కొత్త మార్గం. వాళ్ల సంసారం కొత్త రుచి" అన్పించింది సరోజకి. రోజంతా కల్సి వున్నా తమ బతుకులు అసంతృప్తిగానే వున్నాయెందుకు అనుకుంది. అదే విషయాన్ని మదన్ దగ్గర తీసుకొస్తే అసహ్యంగా కొట్టేసాడు.

"వాళ్లవి అన్నీ పైకి కన్పించే మెరుగులు. మా ఫ్రెండ్ జీవితం ఏమైందో తెల్సా? వాళ్లు వీకెండ్‌లోనే కల్సుకునేవాళ్లు. కాని ఆవిడ తనకు దొరికన స్వేచ్ఛని ఆఫీస్‌లో ఒకడితో అక్రమ సంబంధం పెట్టుకొని... చివరకి విడాకుల వరకూ దారి తీసింది. దూరపు కొండలు నునుపు అన్నట్టు నీకు ఆ వీకెండ్ జీవితాలు అర్థం కావులే..." అంటూ కొట్టి పడేసాడు.

"బుద్ధి పెడదోవ పట్టినప్పుడు స్వేచ్ఛని దుర్వినియోగం చేసుకున్నప్పుడు అలాంటివి జరుగుతాయి కాని... మన జీవితాల్లోని మించిన ఆనందం నాకైతే వాళ్లలో కన్పిస్తుంది" ధృడంగా అంది సరోజ.

"పొరుగింటి పుల్లకూర రుచి... అంటే ఇదే మరి. నా ఆఫీసు ఫైలు కనబడి చావట్లేదు. కాస్త చూపి ఏడువ్. మూడువందల అరవై అయిదు రోజుల్లో తొంబై ఆరు రోజులు కల్సుండేవి ఓ సంసారాలేనా? భార్యాభర్తలంటే కల్సి బతకాలి..." ఫైలు వెతుకుతూ ఇల్లంతా చిందర వందర చేస్తూ అన్నాడు.

'మనలా కల్సి బతికే వాళ్లు ఎంతమంది సుఖంగా వున్నారు? రోజూ ఏదో కీచులట. ఆడిపోసుకునే మాటలు లేదంటే టీవి సీరియల్లు..." నోటిదాకా వచ్చిన మాటని ఆపుకుంది సరోజ. ఎందుకంటే మదన్ మొండిగా వాదిస్తాడు.

ఓసారి నందితతో అంటే... 'రెండు రోజుల్లోనే తిరిగి వెళ్లిపోతాం కదా అనే భావన ఎంత మాత్రం పొట్లాడ్డానికి ఆస్కారమివ్వదు' అని నవ్వింది.

ఆర్నెల్లకో, ఏడాదికో ఓసారి వారం రోజులు పుట్టింటికెళ్లి తిరిగి వచ్చేటప్పుడు అదో ఆనందం అన్పించేది. మొదటి రెండు రోజులు సరదా కబుర్లుండేవి. వీళ్లు ఆ ఆనందాన్ని ప్రతి వారం అనుభవించటం గొప్పే కదా అనుకుంది.

ఇంతలో ఫైలు బీరువాలో బట్టల కింద దొరికింది. బట్టలన్నీ బెడ్ మీద అస్తవ్యస్తంగా పడేసి హడావిడిగా వెళ్లిపోయాడు. రెండో శనివారం అయినా ఆఫీస్‌కెళ్లి పని చేయాల్సినంత వర్క్‌లోడ్ వుంటుంది. పదో పరకో లంచాలు దొరుకుతాయన్న ఆశ. సరోజకి అన్నీ సర్దలేక చిరాకేసింది.

అలాంటి వీకెండ్ జీవితం గడపడానికి తనకేమైనా ఉజ్జోగమా... సజ్జోగమా? అలాంటి భార్యల ఆకాంక్షలను అర్థం చేసుకునే భర్తల్లో వస్తున్న మార్పు

ఆశించదగిందే అనుకుంది. మదన్‌తో ఈ విషయం ఎంతబాగా చెప్పినా ఆర్థిక విషయాలతో ముడిపెట్టి ఎగతాళి చేస్తాడు.

"రెండు చోట్ల ఇండ్ల కిరాయి, రానుపోను ఖర్చులు, రోజూ మాట్లాడుకుంటుంటే ఫోన్ బిల్లులు, రెండు చోట్ల ఇంటిసామాను, అడిగేవాళ్లుండరు కదాని ఇష్టమొచ్చిన షాపింగ్‌లు... ఇంకేం మిగుల్తాయి. పైన పటారం లోన లొటారం..." అంటాడు.

"అంతకు మించిన ఆనందమేదో వాళ్లకు దొరుకుతుంది కదా" అదేంటో సరిగా చెప్పరాక సరోజన ఆగిపోతే... 'నీ బొంద... సడెన్‌గా కష్టమో సుఖమో వస్తే చెప్పుకోవడానికెవరుంటారు? భార్యాభర్తలు ఇద్దరూ ఎవరికి వారు పైకి రావాలనుకుంటూ పరుగులు పెడితే... దాన్ని సంసారం ఎట్లా అంటాం? వారానికి రెండ్రోజులు కలిసుండే సంసారానికి ఏదైనా పేరు కనిపెట్టారేమో కనుక్కోవాలి" అన్నాడు.

"సంసారం కాదు. సగం సారం" నవ్వింది సరోజన. వాళ్ల పట్ల అలాంటి జోకు లేసుకోవటం తప్పుకదాని ఆగిపోయింది.

అయినా అప్పుడప్పుడు భర్త దారిలోనే ఆలోచనలు మర్లుతున్నాయి.

"సంసారం అంటే సర్దుబాటు అంటారు. సర్దుబాటుక్కూడా ఓ హద్దు పద్దు వుండకూడదా? ఉమ్మడి కుటుంబాల నుంచి వ్యష్టి కుటుంబాల కొచ్చాం. వ్యష్టి కుటుంబాల నుంచి వీకెండ్ కుటుంబాల కొస్తున్నాం... అక్కన్నించి ఇంకెటువైపు వెళ్తాం..." ఇలాంటి ఆలోచనలతో సరోజనలో ఏదో దిగులు కమ్మేస్తుంది.

'భార్యభర్తలు ఎప్పుడూ ఒకరికళ్ల ముందు ఒకరు కన్పించకుండా వుండటం విరహం పెంచడానికి కారణమవుతుందేమో కాని.. జాగ్రత్తగా వుండకపోతే వివాహ బంధం దెబ్బ తినడానికి ఇంతకన్నా ఏం కావాలి? ఫలానా కంపెనీలో 'డేటింగ్

అలవెన్స్' ఇస్తున్నారని పేపర్‌లో వచ్చిన వార్తలు చదివి నందిత ఫ్రెండ్‌కి వాళ్లాయనకీ పెద్ద గొడవలయ్యాయని ఓసారి చెప్పింది చివరికి 'దూరం' వాళ్లిద్దర్ని దూరం చేసిందనీ చెప్పింది. నందిత వాళ్లు ఇంత ఆనందంగా వుంటున్నారంటే ఒకరి పట్ల ఒకరికి ఎంత బలమైన నమ్మకం వుండాలి...'

"సరోజన" పక్కింట్లోంచి నందిత పిలవటంతో ఈ లోకంలోకొచ్చి పడింది. నందిత స్వీట్ డబ్బా ఇస్తూ... "రేపు ఈవినింగ్ వెళ్లిపోతం కదా... స్వీట్లు నేనెక్కువ తినను" అంది.

"తినే అలవాటు లేనప్పుడు ఇంతింత స్వీటు ఎందుకు తీసుకొస్తారు మీవారు?" నవ్వుతూ అడిగింది.

"ఈసారి రెండు కిలోలు తెచ్చారు ఆయన ఉద్యోగం మారుతున్నారు. వేరే కంపెనీలోకి... అదే ఆనందంతో తెచ్చారు.." అంది.

"అదేంటి.. రెండేళ్ల కిందే ఈ జాబ్‌లో జాయినయ్యాడన్నారు?"

"అవును. ఇప్పుడు ఓ కంపెనీలో కార్పోరేట్ ఎగ్జిక్యూటివ్‌గా వచ్చింది. సోమవారం జాయినవుతున్నారు" అనేసి వెళ్లిపోయింది. తనను మిస్సవుతాను అన్నంత ఆతృతగా...

సరోజన ఇంట్లోకి వచ్చి స్వీట్ ముక్క నోట్లేసుకుంది.

"ఏంటి వీళ్లు... ఏకంగా ఉద్యోగాల్నే మార్చేస్తున్నారు. ఎంత సాహసం కావాలి? అవకాశాన్ని అందుకోవడమే వీళ్ల జీవితమా? మదన్ ఏడేళ్లుగా సీనియర్ అసిస్టెంట్ ప్రమోషనొస్తుందని ఎదిరి చూస్తూనే వున్నాడు. అది రాదు... ఇది పోదు.. గానుగెద్దుకు గంగడోలు కట్టినట్టు ఏడాదికొకసారి ఇంక్రిమెంటొచ్చినప్పుడు ఇంత స్వీటు... కాని వీళ్లు... ఉద్యోగాల్తోపాటు నగరం నించి నగరం మారిపోతున్నారు.

ప్రమోషనొస్తే ఏ వూరు ట్రాన్స్‌ఫరవుతుందోనని అయిదేళ్లుగా బెంబేలు పడుతూనే వున్నాం. ఈ సంసారం కాని, ఈ ఉద్యోగం కాని ఏ కొత్త చైతన్యం నింపటం లేదు... ఉత్సాహం నింపుకోవడానికి ఏ కొత్త పరిస్థితులూ అనుకూలించట్లేదు... క్షణం పాటు దూరమైతే అతడ్ని మిస్సవుతున్నట్టు నందిత ఇంట్లోకి పరిగెత్తినప్పుడు కళ్లలోని ఆనందం, ఆతృత ఎంత కొత్తగా వున్నాయి. " అనుకుంది.

ఇంతలో ఫోన్ మోగింది...

అవతల్నించి మదన్ "సరోజా... చింతపండు రేటు పెరుగుతుందట. మా ఆఫీసులో అటెండరు నలభై కిలోలు తెచ్చాడు. మనకెంతకావాలి చెప్పు" అనడిగాడు.

"ఆరేడు కిలోలు కావాలి గాని పుల్లగా వుందో లేదో చూసారా?" అనడిగింది. "మరీ పుల్లగా ఏం లేదు. ఆరు కిలోలు తీసుకుంటాను. ఏం చేస్తున్నావ్" అన్నాడు.

"స్వీట్లు తింటున్నాను"

"స్వీటెక్కడిదోయ్"

ఆఫీసు ఫోన్ కాబట్టి అరగంటయినా మాట్లాడుతాడని సరోజనకి తెల్సు.

"నందిత వాళ్లాయన ఉద్యోగం మారాడట"

"ప్రైవేట్ ఉద్యోగాలు ఎప్పుడు ఊడుతాయో తెలీదు మరి. గవర్నమెంట్ ఉద్యోగమంత సేఫ్ కాదుగదా..." అన్నాడు. ఏడేడు జన్మల పుణ్యం చేస్తే తప్ప గవర్నమెంట్ ఉద్యోగం దొరకదన్నంత ధీమా... అలాంటి గవర్నమెంట్ ఉద్యోగి భర్తగా దొరకటం మీకు పన్నెండు జన్మల పుణ్యఫలితం అన్నంత అహంభావమూ వుంటుందా మాటలో.

"మీరు జీతాన్ని... జీవితాన్ని ఇంకా పాత చింతకాయ పచ్చడిగానే అపురూపంగా చూస్తున్నారు గాని... అవకాశాన్ని అంది పుచ్చుకోవటంలో వుండే థ్రిల్‌ని మీరు కోల్పోతున్నారు కదా" అంది.

"నీ బొంద... నీవన్నీ అదోటైపు ఆలోచనలు... నిలకడలేని వాళ్లే స్థిరంగా ఏ ఉద్యోగంలో వుండలేరు. అలాంటివాళ్లకు రిటైర్ అయ్యాక తెలుస్తుంది. ఉద్యోగాలు మారిమారి ఏ ప్రావిడెంట్ ఫండ్ సరిగ్గా దక్కదు. ఏ పెన్షనూ సరిగ్గా రాదు" అని ఫోన్ పెట్టేసాడు.

సరోజన నవ్వుకుంది.

తనకు పెళ్లి సంబంధాలు చేసేటప్పుడు నాన్న కూడా 'గవర్నమెంట్ ఉద్యోగం, పెన్షనబుల్ జాబ్ అనే పదాలు ఎప్పుడూ వాడేవారు.

'ఉద్యోగమే జీవితం వీళ్లకి...' నిష్ఠూరంగా అనుకుంది.

ఇంతలో గేటు చప్పుడయింది.

సరోజన తలతిప్పి చూస్తే బాబాయి, ఆయన కూతురు మాల్య వస్తున్నారు. ఆనందంగా ఎదురెళ్లింది. మాల్య మొహం వెలిగిపోతుంది. చేతిలో స్వీట్ ప్యాకెట్.

"ఎలా వున్నావే?" బాబాయి సరోజన తల నిమిరి ప్రేమగా పలకరించాడు. పిన్ని కూరగాయలు, జామపండ్లు పంపింది బిడ్డా... అంటూ చేతిసంచి అందించాడు.

సంచి తీసుకుంటూ 'బాగున్నాను' అంటూ ఇద్దర్నీ లోపలికి తీసికెళ్లింది.

'అక్కా... గుడ్‌న్యూస్' అంటూ మాల్య సంతోషంగా సరోజన నోట్లో స్వీట్లు కుక్కింది. రెండు చేతులు పట్టుకొని గిర్రున తిప్పింది.

"ఏంటే... ఇంకా మీ డిగ్రీ ఎగ్జామ్స్ కూడా కాలేదు... ఎంటా గుడ్ న్యూస్? బాబాయ్... కొంపదీసి దీనికిప్పుడే పెళ్లి సంబంధం సెటిల్ చేసారా? అదే అయితే సారీ... ముందు నువ్వు ఉద్యోగం సంపాదించుకోవాలి... తర్వాతే పెళ్లి..." అంది సరోజన కొంచెం కోపంగా...

"ఉద్యోగం వచ్చిందక్కా... అదే గుడ్‌న్యూస్.." మాల్య కళ్ల నిండా ఏదో సాధించిన వెలుగు.

"నీ డిగ్రీయే పూర్తికాలేదు... జాబేంటే... ఏదైనా గొర్రెతోక ఉద్యోగం కాదుకదా" అంది.

"ఆ ఉద్యోగమేంటో నాకేం తెలీదమ్మా... నాకు అవన్నీ అర్థం కావు. దాన్నే అడుగు" అన్నాడు.

మాల్యని చూస్తే సరోజనకి సిగ్గుగా అన్పిస్తుంది. అది రోజూ చదువుకోవడానికి పల్లెటూరి నించి బస్‌లో రావాలి. ఇరవై కిలోమీటర్ల దూరం. మనింట్లో వుంచుకుందాం అని మదన్‌తో అంటే... నెలకి రెండు వేలిమ్మన్నాడు. వ్యవసాయం చేసుకునే బాబాయి అంతివ్వలేను బాబూ అంటూ బస్‌పాస్ తీసి కూతురుకిచ్చాడు.

మూడేళ్లుగా అది రోజూ పల్లెనుంచి అప్ అండ్ డౌన్ చేస్తోంది.

"ముందు కంగ్రాట్స్ చెప్పక్కా" మాల్య కుదిపేస్తూ అంది.

"కంగ్రాట్స్... జాబ్ ఏంటో చెప్పు" అనడిగింది.

"గ్రామీణ విద్యార్థులకి ఎలక్ట్రానిక్ గవర్నెన్స్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు పెట్టింది. జవహర్ నాలెడ్జి సెంటర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌మిషన్ ద్వారా ఆరు వందల మందికి ట్రేయినింగ్ ఇచ్చారు. ఆ ట్రెయినింగ్‌లో నేనే ఫస్టొచ్చాను. అమెరికన్

ఐ.టి., కంపెనీ కాంగ్నిజెంట్ టెక్నాలజీలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతానికి జీతం పదహారువేలు. వచ్చే నెలలో ఫైనలియర్ ఎగ్జామ్స్ కాగానే జాబ్ జాయినవ్వాలి. ఉద్యోగం హైదరాబాద్‌లో..." మాల్య గడగడా చెప్పేసింది.

సరోజనకి మతిపోయింది.

రోజూ పల్లెటూరి నించి వచ్చేపోయే ఓ అమ్మాయికి... అమెరికన్ ఐ.టి. కంపెనీలో ఉద్యోగం... నమ్మశక్యంగానట్టు చూసి తర్వాత మాల్యని గట్టిగా కౌగిలించుకుంది.

భోజనాలయిపోయేంత వరకు మాల్య ప్లేస్‌మెంట్ మిషన్ ట్రెయినింగ్ గురించి... ఇంటర్వ్యూ గురించి గడగడా చెప్పేస్తూనే వుంది.

రెండు గంటల తర్వాత బయల్దేరారు.

"మాల్య ఉద్యోగంలో చేరక ముందే... ఈ సంగతి తెల్సి ఓ పెళ్లి సంబంధం వచ్చిందమ్మా. మన పక్కవూరు శెకల్లలో రామయ్య పంతులు గారి కొడుకు... ఇప్పుడు తాంబూలాలు పుచ్చుకొని ఏడాది తర్వాత పెళ్లి చేసినా పర్వాలేదంటున్నారు. అబ్బాయి బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్" బయల్దేరుతూ చెప్పాడు బాబాయి.

సరోజన సందిగ్ధంగా అంది...

"కానీ బాబాయ్... అబ్బాయి బెంగుళూర్‌లో... మాల్య హైదరాబాద్‌లో..."

"అయితే ఏమవుతుందక్కా... వీకెండ్స్‌లో కల్సుకుంటాం కదా" మాల్య సదెన్‌గా అంది. సరోజనకి చెళ్లుమని కొట్టినట్లయింది...

వీకెండ్....

నగర జీవితాల్లోకి చొచ్చుకు వస్తున్న ఒక సాహసోపేతమైన పదం...

గరిష్టమైన ఆనందానికిప్పుడది పర్యాయపదం...

ఆడదాని జీతం చన్నీళ్లకు వేన్నీళ్లు తోడు అనే భావం నించి తన్నేసి... దూరాతి దూరంలో వుంటూ కూడా జీవితాల్ని సమన్వయం చేసుకునే సవాల్‌ని స్వీకరిస్తున్న కొత్త తరానికి ప్రతినిధిగా కన్పించింది మాల్య.

పెళ్లి మాటెత్తగానే ఏ సిగ్గూ కన్పించలేదు... స్థిరత్వం తప్ప!

బాబాయి వెనకే మాల్య నడుస్తోంది....

కొంచెం స్వేచ్ఛ...

కొంచెం బంధం...

వివాహ సంబంధాల్ని కొత్త దారి మళ్లిస్తున్న మార్గదర్శకులు...

సంసారానికి సరికొత్త నిర్వచనం రాస్తున్న సృజనశీలురు...

వీళ్లేనేమో...!!! అన్పించింది.

మాల్య కనుమరుగయ్యేంతవరకూ సరోజిన గేటు దగ్గరే చూస్తూ నిల్చుంది.

*